క్లుప్తంగా

ఉపాధి హామీ పనులు ప్రారంభం



ఇబ్రహీంపూర్‌లో ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ రంగారావు పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్): ఉపాధి పనుల జాతరలో భాగంగా అందోల్ మండలంలోని నేరడిగుంట, రోళ్లపాడ్, చింతకుంట, కన్‌సాన్‌పల్లి, కోడెకల్, సంగుపేట, వట్‌పల్లి మండలంలోని బిజిలీపూర్ గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు అంజయ్య, రాజేశ్‌కుమార్, ఎంపీఓ సోమ్‌నారాయణ, ఏపీఓ అర్చన పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: వినాయక చవితి సందర్భంగా ఈనెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్ గడ్డ సిద్ధి వినాయక దేవాలయంలో వినాయక చవితి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్, ఆలయ అర్చకులు సంతోష్ జోషి, చంద్రశేఖర్, జగదీశ్వర్ స్వామి, అయ్యప్ప, సతీష్, మాజీ సర్పంచులు సుధీర్ రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు సహకారం



విద్యార్థులకు ఐడీ కార్డులు, బెల్టులు పంపిణీ చేస్తున్న వైద్యుడు, హెచ్‌ఎం

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీదర్ ద్వారకా ఆస్పత్రి వైద్యుడు సందీప్ సూచించారు. ఈ మేరకు మిర్జాపూర్(బి)లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న 312 మంది విద్యార్థులకు సొంత ఖర్చులతో ఐడీ కార్డులు, బెల్టులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు



రోడ్డుకు చేయిస్తున్న మరమ్మతు పనులు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట చౌరస్తా నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ మేరకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కుమ్మరి లింగన్న ఉచితంగా పూడ్చివేసి ఔదార్యం చాటాడు. అలాగే గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారంగా బోరు వేయించి మోటారు బిగించారు. దీంతో గ్రామస్తులు ప్రశంసించారు.

పనుల జాతరలో భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సీఈఓ జానకిరెడ్డి

జహీరాబాద్ టౌన్: మండలంలోని అనేగుంటలో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ మేరకు పశువుల పాక, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణానికి పూజలు చేసి శంస్థాపన చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు పూజలు నిర్వహించిన అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ జ్యోతి, మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయశాఖ ఏడీఏ. భిక్షపతి, డిప్యూటీ ఈఈ, రామచందర్, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, ఏపీఓ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌లతో సాగు!



డ్రోన్‌తో పత్తి పంటకు పిచికారీ చేస్తున్న మందు

వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుంది. విత్తనాలు చల్లడంతో పాటు మందులను తక్కువ సమయంలో సులువుగా పిచికారీ చేస్తుంది. ప్రస్తుతం ఈ టెక్నాలజీ మారుమూల గ్రామాలకు చేరింది. దీంతో పంటల సాగులో వ్యయం తగ్గించడం కోసం రైతులు ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నారు. ప్రధానంగా కూలీల కొరత అధిగమించేందుకు డ్రోన్‌ల సాయంతో క్రిమిసంహారక మందులు పిచికారీ చేయిస్తున్నారు. త్వారా ఖర్చు తగ్గడంతో పాటు తక్కువ సమయంలో అధిక విస్తీర్ణంలో మందును పిచికారీ చేసేందుకు వెసులుబాటు కల్గుతుంది.

ఎకరాకు పది నిమిషాల్లో మందుల పిచికారీ

- టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటున్న రైతులు
- సమయం, కూలీ ఆదాతో తప్పిన ఇబ్బందులు

జహీరాబాద్ టౌన్: జిల్లాలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో పత్తి, సోయాబిన్, కంది తదితర పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి తదితర పంటలు ఏపుగా పెరిగాయి. పంట ఎదుగుదల, పూత, కాత కోసం రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు. అధిక వర్షాలకు పంట రంగు మారుతుండడంతో మందులు పిచికారీ చేయాల్సి వస్తుంది. అయితే కూలీల కొరత, పెరిగిన పెట్టుబడులతో రైతులు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ క్రమంలో కొంత మంది రైతులు డ్రోన్‌ల సహాయంతో పంటలకు మందులు పిచికారీ చేయిస్తున్నారు. ప్రధానంగా జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గంలో పలువురు రైతులు డ్రోన్ సాంకేతిక పరిజ్ఞాన్ని ఉపయోగించుకుంటున్నారు. కొంత మంది డ్రోన్‌లు అద్దెకు నడుపుతున్నారు. డ్రోన్‌లు ఎకరా పంటను కేవలం పది నిముషాల్లో మందులను పిచికారి చేస్తుంది. నేరుగా మొక్కలపై మందులను పిచికారీ చేయడంతో మందు వృథా కావడంలేదు. ఇద్దరు కూలీలు అవసరమయ్యే పనిని ఒక్క డ్రోన్ తక్కువ సమయంలో పూర్తి చేస్తుంది. అయితే గతంలో మందులు పచికారీ చేస్తున్న సమయంలో రైతులు ఇబ్బందులు పడేవారు. కొంతమందికి ఏకంగా ముక్కు, నోరు, శరీరంపై పడి ఆస్పత్రుల పాలయ్యేవారు, కానీ డ్రోన్ వచ్చాక ఈ ప్రమాదం నుంచి ఉపశమనం కలిగింది. మందుల వృథాతో పాటు ఖర్చులు కూడా తగ్గుతుండడంతో ఎక్కువమంది రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

12 ఎకరాలు.. గంటలో పిచికారీ

డ్రోన్ ద్వారా మందుల పిచికారీ ఉపయోగకరంగా ఉంది. 12 ఎకరాల్లో ఉన్న పత్తి చేనుకు గంట మాత్రమే పట్టింది. పంట ఏపుగా పెరగడంతో రైతులు మందులు పిచికారీ చేయడం కష్టంగా మారింది. కానీ డ్రోన్‌తో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట మొత్తానికి తక్కువ సమయంలో పిచికారీ చేశారు. గంటకు రూ.400 కిరాయి తీసుకోవడంతో ఖర్చు కూడా తగ్గింది.

– సిద్దారెడ్డి, రైతు

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి అభినాష్ వర్మ

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారి అభినాష్ వర్మ రైతులకు సూచించారు. మండల పరిధిలోని వడ్డిలో శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ అన్ని రకాల భూముల్లో సాగు చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందిస్తామన్నారు. పంట నిర్వహణ కోసం ఏడాదిలో ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగేళ్ల పాటు రూ.16,800 ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మాధవి, హెచ్‌ఈఓ విఠల్, రైతులు పాల్గొన్నారు.

295 రకంతో మంచి దిగుబడులు

జహీరాబాద్ టౌన్: వ్యవసాయ శాఖ పంపిణీ చేసిన ఎంజీజీ 295 రకం పెసర పంటతో మంచి ఫలితాలు వస్తున్నాయని ఏఓ లావణ్య పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని కోత్తూర్(బి)లో వ్యవసాయ శాఖ ప్రదర్శించిన ఎంజీజీ 295 రకం పెసర పంటను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజు రైతులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన



కాశీపూర్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకటలక్ష్మి

కంది(సంగారెడ్డి: నానో యూరియాతో అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కాశీపూర్లో రసాయనిక మందులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయడంతోపాటు నానో యూరియా వాడకంపై అవగాహన రైతులకు కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీటరు నానో యూరియా బస్తా యూరియాతో సమానమని తెలిపారు. కాగా, ప్రస్తుతం మండలంలో 60 మెట్రిక్ టన్నుల యూరియా 45 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ..

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి సారిక, ఎస్‌ఐ చైతన్య కిరణ్‌తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భగంగా పురుగు మందులను పరిశీలించి ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువులు, పురుగుమందులను ఎమ్మార్పీలకే ధరలకే విక్రయించాలన్నారు. అనంతరం ఆయా దుకాణాల్లో విక్రయించిన ఎరువులు, పురుగు మందుల వివరాలను తెలుసుకుని రిజిస్టర్లను తనిఖీ చేశారు.

అవినీతి అక్రమాల ఫిర్యాదుపై విచారణ



విచారణ చేస్తున్న డీఎల్పీఓ అనిత

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని దౌల్తాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, ఇళ్ల నిర్మాణం అనుమతులపై వచ్చిన ఫిర్యాదుపై డీఎల్పీఓ అనిత శుక్రవారం విచారణ చేపట్టారు. దౌల్తాబాద్‌కి చెందిన పలువురు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో సీసీ రోడ్లు, కొత్త ఇళ్ల నిర్మాణం అనుమతుల్లో అవినీతి అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల ఆదేశాల మేరకు దౌల్తాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిరంగ విచారణ చేపట్టినట్లు డీఎల్పీఓ తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ యూసుఫ్, పంచాయతీ ప్రత్యేక అధికారి వెంకట్ నరసింహ గౌడ్ ఉన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు పారిశ్రామికవాడలోని నీకో మాక్ పరిశ్రమ సిబ్బంది అల్పాహారం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది పేద విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు యాజమాన్యం పేర్కొంది. పరిశ్రమ యాజమాన్యానికి ఎంఈఓ కుమార స్వామి, హెచ్‌ఎం అంజయ్య ధన్యవాదాలు తెలిపారు.

ఆలయాల్లో మహోత్సవాలు

నారాయణఖేడ్: శ్రావణమాసంలో చివరి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని షిర్డీ సాయిబాబా, చక్ర లలితాంబిక దేవి ఆలయాల్లో మహోత్సవాలు ఘనంగా జరిగాయి. షిర్డీసాయిబాబా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. అలాగే పట్టణానికి చెందిన రమేష్ మహాప్రసాదం, భారతి, విజయ్ కుమార్ దంపతులు సమస్తపూజా సామగ్రి అందించారు. అనంతరం చక్రలలితాంబిక దేవి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు పంతులు ఆధ్వర్యంలో అమ్మవారికి 10,008 గాజులతో అలంకరణ నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి

ఝరాసంగం(జహీరాబాద్): వినాయక చవితి పండుగ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మంజుల, ఎస్‌ఐ క్రాంతి కుమార్ పాటిల్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పండుగ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు.

సింగూరుకు తగ్గిన వరద



సింగూరు డ్యాం

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టడంతో మూడు క్రస్టు గేట్‌లను మూసివేశారు. ప్రస్తుతం 9, 11 గేట్‌లను రెండు మీటర్ల పైకి ఎత్తి దిగువకు 18,672 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి



ఇరిగిపల్లిలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనుల జాతర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇరిగిపల్లిలో పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో భూమి పూజ..

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని చేర్యాలలో శుక్రవారం అంగన్‌వాడీ భవనం, ఏర్దనూర్ తండాలో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణం పనులకు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విడతల వారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్, నాయకులు ఆంజనేయులు, మోతిలాల్ నాయక్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి చలపతిరావు

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్‌లో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ చలపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రేషన్ కార్డులను అందజేస్తుందన్నారు. ఆధార్‌కార్డుతో పాటు రేషన్ కార్డు ముఖ్యమన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులు కావాలంటే రేషన్ కార్డు తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌కుమార్, ఆర్‌ఐ సిధారెడ్డి, ఏపీఓ గణేష్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ అవేల, మాజీ ఎంపీపీ ప్రియాంక, గ్రామస్తులు గుర్నాథ్ రెడ్డి, గుండన్న, సిద్దప్ప, బాబా పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి పీహెచ్‌డీ పట్టా



పట్టా అందుకుంటున్న బేగరి విష్ణు

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలంలోని పోతిరెడ్డికి చెందిన బేగరి విష్ణు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విష్ణు ఓయూలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ అమరేందర్ రెడ్డి పర్యవేక్షణలో 'సర్వ శిక్ష అభియాన్: ఇంపాక్ట్ ఆన్ క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇన్ గవర్నమెంట్ స్కూల్స్ ఆఫ్ సంగారెడ్డి డిస్ట్రిక్ట్, తెలంగాణ స్టేట్' అనే అంశంపై పరిశోధన చేయడంతో పీహెచ్‌డీ పట్టా లభించింది. ఇటీవల జరిగిన ఓయూ స్నాతకోత్సవంలో గవర్నర్, వీసీ చేతులమీదుగా పట్టా అందుకున్నారు. కాగా, తమ గ్రామానికి చెందిన యువకుడు పీహెచ్‌డీ పట్టా పొందడంపై పోతిరెడ్డిపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న టీఎల్‌ఎం మేళా



బోధనోపకరణాలను పరిశీలిస్తున్న ఎంఈఓ మారుతి రాథోడ్ తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రంలో శుక్రవారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ మేళాకు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హాజరై తయారు చేసిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. ఈ బోధనోపకరణాలను ఎంఈఓ మారుతి రాథోడ్, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల హెచ్‌ఎంలు పరిశీలించారు. ఇందులో మామిడ్గి, న్యామతాబాద్, ఇబ్రహీంపూర్, శంశల్లాపూర్, రేజింతల్, ముర్తుజాపూర్, చాల్కి, మిర్జాపూర్(ఎస్), మిర్జాపూర్(బి), రేజింతల్(ఉర్దూ మీడియం) తయారు చేసిన బోధనోపకరణాలను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు మెమంటోలు అందజేశారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

సంగారెడ్డి టౌన్: కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు అందజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్లాపూర్ యూబీ నైజాం పరిశ్రమ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీవోలను సవరించకపోవడం అత్యంత దారుణమన్నారు. వెంటనే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను గుర్తించి వారికి కనీస వేతనాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రవీణ్, ప్రేమ్ సాగర్, రాజు, లింగం గౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

తాటిపల్లి కేజీబీవీ అభివృద్ధికి కృషి

మంత్రి దామోదర రాజనర్సింహా



పాఠశాలలో పరిశీలిస్తున్న మంత్రి దామోదర

మునిపల్లి(అందోల్): కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించిన మంత్రి రాత్రి తాటిపల్లి కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ మేరకు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. వెంటనే అదనపు గదులు, డైనింగ్ హాల్, మరుగు దొడ్లు, కిచెన్ రూం, హాలు, ప్లే గ్రౌండ్ వంటి పలు అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. వెంటనే పనులు ప్రారంభించాల ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంజయ్య, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు డయల్ యువర్ డీఎం

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 23న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీకి సంబంధించిన సందేహాలు, సలహాలు, సూచనల కోసం నంబర్.99592 26260కు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఫోన్ చేసి తెలపాలన్నారు.

◆ అక్రమాలకు పాల్పడితే చర్యలు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ ఖాజిపల్లి పరిధిలోని సర్వే నంబర్ 181 ప్రభుత్వ స్థలంలో అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులకు రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు కొంతమంది పునాదులు తీశారు. స్థానికుల ఫిర్యాదుతో శుక్రవారం తహసీల్దార్ దేవదాసు ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాష్ నారాయణ అక్రమ పునాదులను జేసీబీతో పూడ్చివేయించారు.

◆ రోడ్లకు మరమ్మతులు చేయండి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో అశోక్‌నగర్‌కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ పుష్ప అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో రోడ్లు గుంతలమాయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ జాగో తెలంగాణ నాయకుల అరెస్టు

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రంలో బంద్‌కు పిలుపునిచ్చిన జాగో తెలంగాణ నాయకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు రాములును పోలీసులు అరెస్టు చేశారు.

◆ నేడు ప్రత్యేక పూజలు..

పటాన్‌చెరు టౌన్: స్థానిక డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర దేవస్థానంలో శనివారం శని అమావాస్యను పురస్కరించుకొని పూజలు చేస్తున్నట్లు ఆలయ అర్చకులు మహేష్, గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక

నారాయణఖేడ్: ఏబీవీపీ జిల్లా సంఘటన మంత్రి వేణుగోపాల్, జిల్లా కన్వీనర్ రాజుల ఆధ్వర్యంలో శుక్రవారం ఏబీవీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా నాగ్‌నాథ్‌రావు, కార్యదర్శిగా శంకర్, ఉపాధ్యక్షులుగా నగేష్, చందు, విష్ణు, నాని ఎన్నికయ్యారు.

◆ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం మోర్గి ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో అంబేడ్కర్ చిత్రపటాన్ని స్టోర్ రూంలో పడేసి అవమానించిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, డీవైఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు.

◆ బీజేపీ నాయకుల అరెస్టు

నారాయణఖేడ్: పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి వెళ్తున్న మండల బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయినవారిలో బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్, నాయకులు రాజశేఖర్ గౌడ్, మాణిక్, భూంరాజ్, పవన్, సాయేందర్ ఉన్నారు. జహీరాబాద్: యూరియా సమస్యలపై ధర్నా చేసేందుకు హైదరాబాద్ వెళ్తున్న బీజేపీ నేతలను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దుర్గయ్య, విశ్వనాథ్, మోహన్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు ఉన్నారు.

◆ విద్యుత్ కనెక్షన్‌కు అనుమతి తీసుకోండి

నారాయణఖేడ్: గణపతి మండలపాలకు విద్యుత్ కనెక్షన్ కోసం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఏడీఈ నాగిరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కనెక్షన్ కోసం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ నేడు విద్యుత్ అంతరాయం

జిన్నారం (పటాన్‌చెరు): మండల కేంద్రంతోపాటు సోలక్‌పల్లి, శివనగర్ ప్రాంతాల్లో నేడు ఉదయం 12 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని గుమ్మడిదల ఏడీఈ దుర్గాప్రసాద్, జిన్నారం ఏఈ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 33/11కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు.

◆ 14 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 14 మంది వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా విధించినట్లు పట్టణ ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపారు. అలాగే ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా, మరో ఎనిమిది మందికి రూ.1,500 జరిమానా, మరో ఇద్దరికి రెండు రోజులు, మరో వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు.

◆ ఉచితవైద్య శిబిరం

జిన్నారం (పటాన్‌చెరు): పరిశ్రమలు సాకారంతో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య అన్నారు. శుక్రవారం గడ్డపోతారం పట్టణ పరిధిలో స్థానిక న్యూలాండ్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌మేనేజర్ మధుసూదన్ రెడ్డి, వైద్యులు అడ్రియన్, కవిత, మధుబాబు, రాజేష్, పరిశ్రమ ప్రతినిధులు, వరప్రసాదరావు పాల్గొన్నారు.

◆ ప్రమాదకర గుంతల పూడ్చివేత

నారాయణఖేడ్: పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద రోడ్డుపై పెద్దపెద్ద గుంతలతో రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో మున్సిపల్ సిబ్బంది శుక్రవారం జేసీబీతో గుంతల్లో కంకర వేసి పూడ్చివేశారు.

◆ ప్రకృతి పండగ.. తీజ్

నారాయణఖేడ్: మండలంలోని అకలాయి తండాలో శుక్రవారం తీజ్ ఉత్సవాలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు తండా నాయక్, కారోబారీ, తండా పెద్దల సమక్షంలో యువతులు, మహిళలు సాంప్రదాయ దుస్తులతో ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

◆ నందీశ్వరుడికి పంచలోహ కవచం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెంలో ఉన్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలమ ప్రధాన ద్వారానికి ఎదురుగా ఉన్న నందీశ్వర విగ్రహానికి దాత ఎడవల్లి బాలరాజు పంచలోహ కవచం బహూకరించారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఈవో శశిధర్ గుప్త సమక్షంలో వేదమంత్రాలతో పూజలు నిర్వహించి కవచాన్ని అలంకరించారు.